

# సింగిల్‌పేజీ కథలు

## చిల్లర

యూనివర్శిటీ పనిమీద విశాఖపట్నం బయలుదేరాను. అర్థశాస్త్రంలో యమ్‌ఫిల్ చేస్తూ ఉండడంవల్ల తరచూ విశ్వవిద్యాలయానికి వెళ్లవలసి వస్తోంది.

లెవెల్ క్రాసింగ్ వద్ద రైల్వేగేటు వేసి ఉండడంతో బస్సు ఆగింది.

డ్రైవర్ కిందకి దిగి టీ కొట్లోకి దూరాడు.

అప్రయత్నంగా నేనూ బస్సు దిగి ఓ కిళ్లీబడ్డీ దగ్గర నిలబడ్డాను.

ఆ కొట్టు అప్పుడే తెరిచినట్లుంది.

బస్సు దిగిన ప్యాసింజర్లలో ఒకాయన షాపు వద్దకువెళ్లి ఇరవై రూపాయల కాగితం ఇచ్చి రెండు సిగరెట్లు ఇమ్మన్నాడు.

వెంటనే కొట్టువాడు సిగరెట్లు తీసిచ్చి పదిహేడు రూపాయలు అతని చేతిలో ఉంచాడు.

అది చూసి దేశంలోని చిల్లరంతా ఇక్కడే వుంది కాబోలు అనుకున్నాను నేను. విశాఖలో ఆటోలకు వాటికి చిల్లర అవసరం వుంటుంది. ఎందుకైనా మంచిది చిల్లర మార్చి వుంచుకుంటే మంచిది అనుకున్నాను. అనుకోవడమే తడవుగా వాడికి ఇరవై రూపాయలు నోటిచ్చి రెండు చాకెట్లు ఇమ్మన్నాను.



''చిల్లరలేదు'' అన్నాడు బడ్డీవాడు అదోలా మొహంపెట్టి.

''అతడికెలా వచ్చింది?'' చిరాగ్గా అడిగాను.

''అది బోణీ బేరం'' తాపీమని సమాధానమిచ్చాడు కొట్టువాడు.

''అదిసరే. నీ దగ్గర చిల్లర వుంది కదా. బేరం ఎందుకు వదులుకుంటావ్?'' అని అడిగాను.

''రెండురూపాయల బేరానికి ఇరవై రూపాయల చిల్లర ఇచ్చేస్తే పెద్ద బేరాలు వచ్చినప్పుడు చిల్లరుండదు. మీరు పెద్దవాళ్లు. నేనేమైనా అంటే కోపగించుకుంటారు. మీ పర్సులో ఐదురూపాయల కాగితం చూసాను. అదివ్వచ్చుకదా'' అన్నాడు.

'గడుసుపిండమే' అనుకున్నాను ఏమనాలో తెలియక.

''ఈమధ్య ఐదురూపాయలు కొత్తవి రావడంలేదు. అందుకే వాటికి చిల్లులున్నా, చిరుగులున్నా తీసేసుకుంటున్నాము. అయినా వాటికి కొరత ఏర్పడుతుంది. అందుకు కారణం మనమే బాబు. అదేమిటో చాలామంది జేబులో ఐదు కాగితం వున్నా పదినోటే తీసిస్తున్నారు. అటువంటప్పుడు చిల్లర ఎక్కడనుండి వస్తుంది? డబ్బేకాదు. పొయ్యిమీదకు కావాల్సిన సరుకులనే తీసుకోండి. వాటిలో దేనికైనా కాస్త కొరత ఏర్పడితే చాలు ఎందుకైనా మంచిదని దాచేస్తుంటారు. దాంతో దాని ధర పెరిగిపోతూ వుంటుంది. అది మన పనే తప్ప వస్తువులేక కాదు'' అంటూ ఆగాడు.

చూస్తే ఆ కొట్టువాడు పెద్దగా చదువుకున్నట్లులేదు. అయినా అతడిలో ఓ ఆర్థిక శాస్త్రవేత్త కనిపిస్తున్నాడు. అర్థశాస్త్రంలో యమ్‌ఫిల్ చేస్తున్నా నా విజ్ఞానం అతడిముందు దిగదుడుపే అయింది. ఆదరణకు నోచుకోని జ్ఞానం వున్నా లేకున్నా, ఒక్కటేకదా అనిపించింది.

**– దూరి వెంకటరావు**

25-10-30, దాసన్నపేట, విజయనగరం-535 002.

## అందమైన మనసు

షాపింగ్‌కు వచ్చిన పద్మ తనకు కావాల్సిన వస్తువులను తాను పర్చేజ్ చేసుకోవడం మానేసి తనకు కొంతదూరంలో ఎవరో దంపతుల మాటలే ఆసక్తిగా వింటోంది.

''ఇవన్నీ ఇప్పుడు ఎందుకండీ?''

''ఎందుకేమిటి? ఏదీ లేకుండా నువ్వు ఇబ్బంది పడకూడదు, కష్టపడకూడదు. దట్సాల్.''

''సరేలెండి మీ ఇష్టం'' ఆమె నవ్వింది పకపకా.

ఆ నవ్వు తనకెక్కడో పరిచయంగా కూడా అనిపించి వెనక్కి తిరిగి చూసింది.

''రమ్యా!'' అంది భుజంమీద చెయ్యివేస్తూ.

రమ్య కూడా పద్మని చూసి ఆశ్చర్యపోయింది.

''హాయ్ పద్మా నువ్వా?'' అంది నవ్వుతూ.

''అవును. నేనే, పోనీలే నీకు ఇంకా గుర్తున్నానుకదా. నామీద నీకేం కోపంలేదు కదా?''

''ఎందుకూ?''

''ఆరోజు పెళ్లిలో నిన్ను వెక్కిరించాను కదా. నీ భర్త నల్లగా, తుమ్మజిగురులా ఉన్నాడు, అందంగా లేడు, ఇదేం సెలక్షను? అంటూ. నువ్వు అప్పుడు అలిగావు కూడా. గుర్తుందా?''

''నేనవన్నీ ఎప్పుడో మర్చిపోయాను'' అంది నవ్వుతూ దూరంగా తన భర్త తన కోసం ఏదో కొనడం చూస్తూ ఆప్యాయంగా.

''ఎలా వుంది నీ సంసారం?'' అడిగింది పద్మ.

''మూడుపువ్వులు, ఆరుకాయలుగా. ఆయన చాలా మంచివారు. నన్ను ప్రేమగా, ప్రాణంగా చూసుకుంటారు. మనసు వెన్నలాంటిది. మాట, స్వభావం సున్నితం. కాలు కందనివ్వరు. ఇంక నాకు అంతకన్నా ఏం కావాలి? అత్త ఆడపడుచులు ఆప్యాయంగా చూసుకుంటారు'' అంది ఆనంద పడిపోతూ.

పద్మ ముఖం ముడుచుకుంది. అది చూసి రమ్య–

''ఏమే అలా ఉన్నావు? నీ సంసారం బాగుందా? ఎందుకు బాగుండదు? మీ ఆయన లక్షాధికారి, అందగాడు, ఇంక నీకేం లోటు?'' రమ్య ప్రశ్నా జవాబు చెప్పేసుకుంటుంటే–

''అనుభవంతోనే తెలుసుకున్నాను. అందమైన మనిషికి అందమైన మనసు మాత్రం ఉండదని. ఆయనకి లేని వ్యసనాలంటూలేవు. అందాన్ని ఉపయోగించుకుని అమ్మాయిలను ఎట్రాక్షన్ చేసుకుంటూ డబ్బు తగలేస్తూ తాగి తందనాలాడడం చేస్తుంటారు. వద్దు అని నేను వారించినా చెయ్యి చేసుకుంటారు. నీ భర్తని నీవు వెనకేస్తూ ఆ రోజు నీవు నాతో అన్న మాటలే గుర్తుకు వస్తూ బాధపడుతుంటాను. నీవన్నది అక్షరాలా నిజం. అందమైన మొగుడిని కట్టుకున్నా ఆనందంగా వుండలేము. కాపలా కాయలేము. సవతుల పోరు భరించలేము. అందంకన్నా గుణం ప్రధానం. అందం అందరినీ ఆనందం పంచుతుంది. అందంలేని చోట తప్పనిసరిగా మంచి గుణం ఉంటుందని నీవు చెప్పిన మాటలు ఇద్దరి జీవితాలకు సరిగ్గా సరిపోతాయి'' అంటూ బాధపడింది.

పద్మకి ఎలా సమాధానం చెప్పాలో తెలియకున్నా తనకు మంచి భర్త దొరికినందుకు తృప్తిపడింది.

**–శ్రీమతి జి. రామలక్ష్మి**

ఫ్లాట్ నెం:306

ఇంటి నెం.2-2-1144/27/1

విజయా అపార్ట్‌మెంట్స్,

న్యూనల్లకుంట, హైదరాబాద్-44.

## ఏది గౌరవం?

మా బ్యాంకు మేనేజర్ కొడుక్కి పుట్టినరోజని స్టాఫందర్నీ పిలిచాడు. అందరం ఫంక్షన్‌కి వెళ్లాం. అందరూ ఏదో ఒక బహుమతిని పట్టుకు వచ్చారు. నెలాఖరు అవడం వల్ల చేతిలో డబ్బులు లేకపోతే ఒక ఫ్రెండ్‌నడిగి యాభై రూపాయలకు ఒక చిన్న కారు బొమ్మని కొని అందంగా ప్యాక్ చేయించి తెచ్చాను.

మేనేజర్ ఇంటిని కలర్ పేపర్లతో అందంగా అలంకించారు. ఇంటిలో పెద్ద పెద్ద